# HISTORY - BOOK FAIR (2021 - 2022)

## తొలి తెలుగు మాటలు పుట్టిందే తెలంగాణలో : శివనాగిరెడ్డి




తెలంగాణ చరిత్రకు గని. ఇక్కడ తవ్విన కొద్దీ చరిత్ర వస్తూనే ఉంటుందని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. ఆంధ్రాలో అంత చరిత్ర లేదని వ్యాఖ్యానించారు. తొలి తెలుగు మాటలు పుట్టింది కూడా తెలంగాణలోనే అని ఆయన వివరించారు. ప్రభుత్వ సిటీకాలేజీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్తంగా గురువారం బుక్ ఫెయిర్‌లోని చిందు ఎల్లమ్మ వేదికపై 'మన చరిత్ర - మన సంస్కృతి' అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఈమని శివనాగిరెడ్డి మాట్లాడుతూ తెలుగులో కుల వాచకాలను అందించింది తెలంగాణ అని, అందుకు ఆనాటి శాసనాలే ఆధారమని అన్నారు. తెలంగాణలోని జిల్లాల చరిత్రను దేనికదే పుస్తకంగా తీసుకురావాల్సిందిగా శివనాగిరెడ్డి తెలంగాణ సాహిత్యఅకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్‌ను కోరారు. కార్యక్రమానికి జూలూరు గౌరీశంకర్ సభాధ్యక్షత వహించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, సిటీ కాలేజీ చరిత్ర అధ్యాపకురాలు సుదక్షణ, చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రతి ఊరు ఒక చరిత్ర చెబుతోంది'

**కవాడిగూడ, న్యూస్‌టుడే:** తెలంగాణ చరిత్ర తవ్వితే ప్రతీ ఊరు ఒక చరిత్ర చెబుతోందని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ పుస్తక ప్రదర్శనలో చిందు ఎల్లమ్మ వేదికపైన తెలంగాణ సాహిత్య అకాడమి, ప్రభుత్వ సిటీ కాలేజీ చరిత్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 'మన చరిత్ర మన సంస్కృతి' అంశంపైన పలువురు చరిత్రకారుల చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షర రూపంతో బీరువాలలో మూలుగుతున్న తెలంగాణ చరిత్ర, శాసనాలను ముద్రించి వెలుగులోకి తీవాలని కోరారు. ప్రముఖ శాసనాల అధ్యయన వేత్త రామోజు హరగోపాల్ మాట్లాడుతూ రుద్రమదేవి యుద్ధ భూమిలో మరణించిన తేదీని మూడుచోట్ల లభించిన శాసనాల ద్వారా వెలికి తీశానని చెప్పారు. ప్రముఖ కవి, రచయిత సింగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ హైదరాబాద్‌కు వంద కిలో మీటర్ల పరిధిలోని చారిత్రక ప్రదేశాలు ఉన్నాయన్నారు. వాటన్నింటిని కలుపుతూ ఆర్టీసీ బస్సులు వేసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. తెలంగాణ సాహిత్య అకాడమి ఛైర్మన్, జాతీయ పుస్తక ప్రదర్శన అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ సభకు అధ్యక్షత వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సంయుక్త కలెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి, రచయిత గుడిపాటి, సిటీ కాలేజీ అధ్యాపకులు శ్రీనివాస్, సుదక్షిణ, కోయి కోటేశ్వర్‌రావు, వడ్డేపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలపిట్ట ప్రత్యేక సంచికను విడుదల చేశారు.

(c) eenadu